క్లుప్తంగా

నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

శంకరపట్నం: అఖిల భారత యాదవ శంకరపట్నం మండల కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కన్నబోయిన జంపయ్య, ప్రధాన కార్యదర్శిగా కుమార్‌యాదవ్, గౌరవ అధ్యక్షుడిగా తిరుపతి, ఉపాధ్యక్షులుగా రాజయ్య, రమేష్, రాజయ్య, కోశాధికారిగా వెంకన్న, ప్రచారకార్యదర్శిగా అనిల్, సలహాదారుడిగా కొంరయ్య, డైరెక్టర్లుగా సమ్మయ్య, రవి, వెంకన్న, రాజు నియామకమయ్యారు.

పాఠశాలను సందర్శించిన ట్రైనీ కలెక్టర్



మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్

రామడుగు: మనఊరు– మనబడి కార్యక్రమంలో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను గురువారం ట్రైనీ కలెక్టర్ లెన్నీ వాట్‌సల్ టొప్పో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాఠశాలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించి అభివృద్ధి చేయడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి వేణుకుమార్, సర్పంచ్ పంజాల ప్రమీలజగన్‌మోహన్‌గౌడ్, ఏఈ సచిన్, హెచ్‌ఎం మల్లారెడ్డి పలువురు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న గీత కార్మికులు

హుజూరాబాద్: పట్టణంలోని తాటివనంలో గురువారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి గీత కార్మికుల సంఘం నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కార్మికులకు ప్రమాద బీమా కల్పించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు బోనగాని ఎల్లయ్య, శ్రీపతి ప్రసాద్, పంజాల రాంశంకర్, పంజాల సంపత్, కెక్కర్ల సారయ్య, పంజాల హరీశ్, తాళ్లపెల్లి శ్రీనివాస్, తాళ్లపెల్లి సారయ్య, పూదరి రవి, పంజాల తాళ్లపెల్లి శ్రీధర్, బోనగాని కుమార్, పిల్లల గోపి తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ బహిరంగ సభకు తరలిరావాలి



మహిళలకు బొట్టుపెడుతున్న రజిత

చిగురుమామిడి: హుస్నాబాద్‌లో శుక్రవారం నిర్వహించే మంత్రి కేటీఆర్ బహిరంగ సభకు తరలివచ్చి విజయవంతం చేయాలని మార్కెట్ కమిటీ వైస్ చైర్‌పర్సన్ రామోజు రజితకృష్ణమాచారి కోరారు. గురువారం మండలంలోని సుందరగిరిలో ఇంటింటికీ తిరుగుతూ మహిళలకు బొట్టుపెట్టి సభకు రావాలని ఆహ్వానించారు. ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. వెంట సుందరగిరి దేవస్థానం అభివృద్ధి కమిటీ సభ్యులు బొల్లం వెంకటలక్ష్మి, కమ్మం మల్లవ్వ, వంతడ్పుల బాలవ్వ, ఎనగందుల లక్ష్మి, అరుణ, రజిత పలువురు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

సైదాపూర్: మండలంలోని బొమ్మకల్‌లో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఏలూరి ఆదిరెడ్డి అల్లుడు ఇటీవల మృతి చెందాడు. గురువారం ఆదిరెడ్డి కుటుంబ సభ్యులను హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి పరామర్శించారు. వెంట కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

అసంపూర్తితో అవస్థలు

- హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యేదెన్నడో..?
- నాలుగేళ్ల క్రితం శంకుస్థాపన
- దాదాపు 80 శాతం పనులు పూర్తి
- త్వరగా పూర్తి చేయాలని కోరుతున్న ప్రజలు



ప్రజావాణిలో విన్నవిస్తున్న గ్రామస్తులు



అసంపూర్తిగా హైలెవల్ బ్రిడ్జి

రామడుగు: మండల కేంద్రం సమీపంలోని మోతె వాగుపై రామడుగు, షానగర్ గ్రామాల మధ్య నాలుగేళ్ల క్రితం హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా పనులు పూర్తి కాలేదు. దీంతో ప్రయాణికులు, వాహనదారులు లోలెవల్ వంతెన పైనుంచి ప్రయాణానికి ఇబ్బందులు పడుతున్నారు.

రూ.7.90 కోట్లతో..

రాష్ట్ర ప్రభుత్వం హైలెవల్ వంతెనకు రూ.7.90 కోట్ల నిధులు మంజూరు చేయగా చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ 2019 ఫిబ్రవరిలో బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కరీంనగర్ నుంచి రామడుగు ద్వారా జగిత్యాల జిల్లాలోని పెగడపల్లి, గొల్లపల్లి, చొప్పదండి మండలాలతో పాటుగా గంగాధర, మల్యాల మండలాలకు ఈ ప్రధాన రహదారి గుండా నిత్యం రాకపోకలు సాగుతుంటాయి. మోతె వాగుపైన ఉన్న లోలెవల్ వంతెనతో నిత్యం ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. గతేడాది భారీ వర్షాలకు లోలెవల్ వంతెనపై నుంచి వరదనీరు ప్రవహించడంతో రెండు రోజులు రాకపోకలు నిలిచిపోయాయి. అంతేకాకుండా ఇరువైపుల గండి పడడంతో అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేశారు.

80 శాతం పనులు పూర్తి

హైలెవల్ వంతెన నిర్మాణ పనులు దాదాపు 80 శాతం పూర్తయ్యాయి. మిగతా పనులు పూర్తి కాకపోవడంతో వంతెన అందుబాటులోకి రాని పరిస్థితి ఏర్పడింది. సంబంధిత అధికారులు తక్షణం పనులు పూర్తి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

భూ సేకరణ సమస్య

వంతెన నిర్మాణానికి అవసరమైన భూసేకరణ సమస్యతో పనులు నిలిచిపోయాయని అధికారులు తెలిపారు. నిర్మాణానికి అవసరమైన భూమి సేకరించడం కోసం రామడుగులో భూసేకరణ గ్రామసభను నిర్వహించారు. హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి షానగర్ గ్రామ పరిధిలో 1.16 ఎకరాలు, రామడుగు గ్రామ పరిధిలో 0.33 ఎకరాలు భూసేకరణ చేయాల్సి ఉంది.

ప్రమాదకరంగా పాత బ్రిడ్జి



పాత బ్రిడ్జి ప్రమాదకరంగా ఉంది. దీంతో ప్రయాణికులు భయం భయంగా ప్రయాణం చేయాల్సివస్తోంది. మరమ్మతులు చేసిన కొద్ది మళ్లీ ధ్వంసమవుతోంది. అధికారులు త్వరగా హైలెవల్ బ్రిడ్జి పనులు పూర్తి చేయాలి.

– పంజాల ప్రమీల, సర్పంచ్, రామడుగు

వారం రోజుల్లో పూర్తి



బ్రిడ్జి నిర్మాణంలో భూమి కోల్పోతున్న రైతులకు త్వరలో ప్రభుత్వం ద్వారా డబ్బులు అందిస్తాం. బ్రిడ్జి పనులు వారం రోజుల్లోపు ప్రారంభించి పూర్తి చేస్తాం. కొన్ని సమస్యలతో పనులు ఆలస్యమవుతోంది నిజమే.

– సుంకె రవిశంకర్, ఎమ్మెల్యే

ప్రజావాణిలో వినతి

బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని గ్రామ పంచాయతీ పాలకవర్గం సభ్యులతో పాటు గ్రామ యువకులు ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

పాతది ఎప్పుడు కూలుతుందో

పాత వంతెన ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. వంతెనపై తరచూ రంధ్రాలు ఏర్పడుతుండటంతో గ్రామస్తులు తాత్కాలిక చర్యలు చేపడుతున్నారు.

నేడు మండల సభ

చొప్పదండి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ చిలుక రవీందర్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించనున్నామని ఎంపీడీవో స్వరూప తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సమావేశ మందిరంలో జరిగే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, గౌరవ సభ్యులు సకాలంలో హాజరు కావాలని కోరారు. సంబంధిత అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని సూచించారు.

నేడు మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ చుక్కరెడ్డి

చొప్పదండి: చొప్పదండి వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో శుక్రవారం మార్క్‌ఫెడ్ ద్వారా ఏర్పాటు చేస్తున్న మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ప్రారంభిస్తున్నారని మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ గడ్డం చుక్కరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెల్మ మల్లారెడ్డి తెలిపారు. మొక్కజొన్నకు బహిరంగ మార్కెట్‌లో ధర పడిపోవడంతో ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయడానికి చొప్పదండి మార్కెట్ యార్డుకు కొనుగోలు కేంద్రం మంజూరు చేసినందని, రైతులు దళారులతో నష్ట పోకుండా మద్దతు ధరకు అమ్ముకోవాలని కోరారు. క్వింటాల్‌కు రూ.1,952 మద్దతు ధర చెల్లించనున్నామని తెలిపారు.

పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు గ్రామంలో అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ గురువారం పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణచేపట్టారు. గ్రామ శివారులోని గుట్టను శ్రీ సేతు గ్రానైట్ కంపెనీ అనుమతి కోసం దరఖాస్తులు చేసుకుంది. ఈ మేరకు గుట్ట వద్ద రైతులు, సామాజిక నేతల నుంచి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. పలు అంశాలను రైతులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి డీఈ భిక్షపతి, ఎంపీపీ సరోజన, సర్పంచ్ కిషన్‌రావు, రెవెన్యూ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీపై అవగాహన



శంకరపట్నం: మాట్లాడుతున్న జేడీ నరేందర్

సైదాపూర్: మండలంలోని రైతు వేదికలో గురువారం గొల్ల, కురుమలకు గొర్రెల పంపిణీ కార్యక్రమంపై జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి నరేందర్ అవగాహన కల్పించారు. ప్రతి లబ్ధిదారుడు ఆధార్ కార్డు, కులధ్రువీకరణ, బ్యాంక్ ఖాతా బుక్ జిరాక్స్ పత్రాలు సమర్పించాలని సూచించారు. లబ్ధిదారుడి వాటా కింద రూ.43,750 కేటాయించిన అకౌంట్‌లో జమచేయాలన్నారు. కార్యక్రమంలో వెన్కెపల్లి, వెన్నంపల్లి పశువైద్యాధికారులు విజేందర్‌రావు, విజేందర్ కురుమ సంఘం మండల అధ్యక్షుడు పెద్ది తిరుపతి, ఎంపీటీసీ ఓదెలు ఉన్నారు.

శంకరపట్నం: రెండో విడత గొర్రెల పంపిణీకి సంబంధించి లబ్ధిదారులతో మండల కేంద్రంలో నరేందర్ సమావేశం నిర్వహించారు. లబ్ధిదారులు ఆధార్‌కార్డు, కులధ్రువీకరణ, బ్యాంకు పాస్‌బుక్, నామిని జిరాక్స్‌లను అందజేయాలన్నారు. గొర్రెల సేకరణకు మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను ఎంపిక చేశామని, జిల్లా స్థాయి అధికారులు సమీక్షంలో పంపిణీ చేస్తామని వివరించారు. ప్రజాప్రతినిధులు, యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్: రెండో విడత గొర్రెల పంపిణీకి లబ్ధిదారులు వాటా సొమ్మును చెల్లించాలని నరేందర్ తెలిపారు. తిమ్మాపూర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలోని సమావేశ మందిరంలో గొర్రెల పెంపకందారుల సహకార సంఘం సభ్యులకు రెండో విడత గొర్రెల పంపిణీపై గురువారం అవగాహన కల్పించారు. జీవాల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నామని, గొర్రెల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో రేణికుంట పశువైద్యాధికారి సాంబరావు, మండల పశువైద్యాధికారి డా. సురేందర్, గొర్రెల పెంపకందారుల సహకార సంఘం సభ్యులు పాల్గొన్నారు.

క్వింటాల్ పత్తి రూ.7,450



జమ్మికుంట: స్థానిక వ్యవసాయ పత్తి మార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర గరిష్ఠంగా రూ.7,450 పలికింది. గురువారం మార్కెట్‌కు 30 వాహనాల్లో 493 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తీసుకువచ్చారు. క్వింటాల్‌కు మోడల్ ధర రూ.7,300, కనిష్ఠ ధర రూ.6,800 వ్యాపారులు చెల్లించారు. గన్నీ సంచుల్లో నలుగురు రైతులు 3 క్వింటాళ్ల పత్తిని తీసుకురాగా గరిష్ట ధర రూ.7 వేలు, మోడల్ ధర రూ.6 వేలు, కనిష్ఠ ధర రూ.5,500కు కొనుగోలు చేశారు. కాగా మార్కెట్‌లో క్రయవిక్రయాలను కార్యదర్శి గుగులోతు రెడ్డి నాయక్ పర్యవేక్షించారు.

బ్రిడ్జి నిర్మించాలని ఎంపీకి వినతి



బండి సంజయ్‌కి వినతిపత్రం ఇస్తున్న ఉదయ్

గన్నేరువరం: మండలంలోని గన్నేరువరం నుంచి కరీంగనర్‌కు లోయర్ మానేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరుతూ గురువారం బ్రిడ్జి నిర్మాణ పోరాట సమితి చైర్మన్ సంపతి ఉదయ్ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌ను కరీంనగర్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. బ్రిడ్జి నిర్మాణంలో గన్నేరువరం, బెజ్జంకి, ఇల్లంతకుంట మండలాల్లోని 87 గ్రామాల ప్రజలకు దూరభారం తగ్గడంతోపాటు సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. ఎంపీ సానుకూలంగా స్పందించారని రాష్ట్ర ప్రభుత్వం అప్రూవల్ ఇస్తే నిర్మాణానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారని ఉదయ్ తెలిపారు. డ్యాం నిర్మాణానికి ముందు కరీంనగర్ కేవలం 12 కిలోమీటర్ల దూరంలో ఉండేదని, నిర్మాణం తర్వాత 40 కిలోమీటర్లు తిరిగిరావాల్సి వస్తోందని, విద్య, ఇతర అవసరాలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే ఇవ్వాలని, జిల్లా మంత్రి ఆ దిశగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, నాయకులు సొల్లు అజయ్‌వర్మ, పుల్లెల పవన్‌కుమార్, కరివేద మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

వెలిచాలలో వైభవంగా పోచమ్మ బోనాలు



బోనాలతో వెళ్తున్న మహిళలు

రామడుగు: మండలంలోని వెలిచాల గ్రామంలో బీరప్ప పట్నాలు సందర్భంగా ముందస్తుగా కుర్మ, యాదవ సంఘం ఆధ్వర్యంలో గురువారం పోచమ్మ బోనాలు నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనాలతో పోచమ్మ ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ వీర్ల సరోజనప్రభాకర్‌రావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వెలిచాలలో శ్రీలక్ష్మీనరసింహ జయంతి

గ్రామంలో గురువారం శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి జయంతి వేదపండితులు వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు, హోమం చేశారు. కార్యక్రమంలో దేవాలయాభివృద్ధి కమిటీ చైర్మన్ వీర్ల ప్రభాకర్‌రావు, భక్తులు పాల్గొన్నారు.

ఎల్లమ్మతల్లి ఆలయం ముస్తాబు

మండలంలోని వెదిర గ్రామంలో 7 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్న శ్రీరేణుకా ఎల్లమ్మ తల్లి పట్నాలకు ఆలయం సుందరంగా ముస్తాబవుతోంది. పట్నాల వేడుకల్లో భాగంగా గౌడ కులస్తులు, నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలో జోగెత్తె కార్యక్రమం మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్నారు. భక్తుల సౌకర్యం కోసం అన్ని ఏర్పాట్లు చేశామని నిర్వాహకులు తెలిపారు.



శ్రీలక్ష్మీనరసింహ జయంతిలో వేదపండితులు



వెదిరలో శ్రీఎల్లమ్మతల్లి దేవాలయం

శ్రీమత్స్యగిరీంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు గ్రామం శ్రీ మత్స్యగిరీంద్రస్వామి ఆలయంలో గురువారం ఉగ్ర నరసింహస్వామి జయంతి సందర్భంగా స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శేషం మురళీధరచార్యులు, ఆలయ చైర్మన్ సాగి మలహల్‌రావు, భక్తులు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న నాయకులు

హుజూరాబాద్: పంట నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం చెల్లించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సొల్లు బాబు డిమాండ్ చేశారు. గురువారం పట్టణ శివారులో ఆరబోసిన వరి ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందని తెలిపారు. ప్రభుత్వం ఎకరాకు రూ.20 వేల చొప్పున పరిహారం అందించాలని కోరారు.

వాహనాల తనిఖీ



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

మానకొండూర్: మండలంలోని చెంజర్ల క్రాస్ రోడ్డు వద్ద సీసీఆర్‌బీ ఏసీపీ మదన్‌లాల్, మానకొండూర్ సీఐ రాజ్‌కుమార్, పీసీఆర్ సీఐ రవీందర్ కరీంనగర్ రూరల్ ఏసీపీ కరుణాకర్ , అడిషనల్ డీసీపీ లా అండ్ ఆర్డర్ శ్రీనివాస్, ఇతర పోలీసులు సిబ్బంది వాహనాల తనిఖీ, డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన వాహనపత్రాలు లేని, మద్యంతాగి వాహనాలు నడిపిన వారికి జరిమానా విధించారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న వాసుదేవరెడ్డి, తదితరులు

జమ్మికుంట: అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. జమ్మికుంట పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పంట నష్టంపై క్షేత్రసాయిలో సర్వే చేసి, ఎకరానికి రూ.30 వేల చొప్పున పరిహారం చెల్లించాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించడం లేదని, జిల్లా వ్యాప్తంగా ఏ ఒక్క రైతుకు పరదాలు, టార్పాలిన్లు అందించలేదని ఆరోపించారు. దీంతో వర్షం కురిసి ధాన్యం తడిసిపోయిందని, రంగు మారి, మొలకెత్తిందని పేర్కొన్నారు. ఆ ధాన్యాన్ని ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత మార్చిలో ప్రకటించిన ఎకరాకు రూ.10 వేల పరిహారం ఇప్పటివరకు ఇవ్వలేదని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జోన్ కార్యదర్శి శీలం అశోక్, సభ్యులు కొప్పుల శంకర్, చెల్పూరి రాములు, జక్కుల రమేశ్ యాదవ్, శ్రీకాంత్, దండిగారి సతీశ్, రాజకుమారి, సమ్మయ్య, సదానందం తదితరులు పాల్గొన్నారు.

జీపీ సిబ్బంది సమ్మె నోటీసు

కరీంనగర్‌రూరల్: గ్రామపంచాయతీ కారోబార్లు, సిబ్బంది తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నుంచి సమ్మె చేసేందుకు సిద్ధమయ్యారు. ఈమేరకు గురువారం కరీంనగర్ మండలంలోని కారోబార్లు ఎంపీడీవో జగన్మోహన్ రెడ్డికి సమ్మె నోటీసు అందజేశారు. గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న కారోబార్లు, బిల్ కలెక్టర్లను మల్టీపర్పస్ వర్కర్ విధానం నుంచి మినహాయించాలని, పంచాయతీ కార్యదర్శికి సహాయ కార్యదర్శిగా నియమించాలనే తదితర డిమాండ్లతో సమ్మె చేయనున్నట్లు తెలంగాణ గ్రామపంచాయతీ కారోబార్స్ అండ్ సిబ్బంది యూనియన్ మండల అధ్యక్షుడు సంపత్, కార్యదర్శి మల్లేశం, సభ్యులు నారాయణ, రాజు తెలిపారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించేందుకు తగిన చర్యలు చేపట్టాలని కోరారు.

కొత్తపల్లి: ఎంపీవో శ్రీనివాస్‌కు గురువారం కొత్తపల్లి మండల కారోబార్లు, బిల్ కలెక్టర్లు, పంప్ ఆపరేటర్లు, ఎలక్ట్రీషన్లు, సఫాయి కార్మి కులు సమ్మె నోటీసును అందజేశారు. డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ సమ్మెకు దిగనున్నట్లు వెల్లడించారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు

- ట్రాక్టర్ డ్రైవర్‌కు తృటిలో తప్పిన ప్రాణాపాయం



తిమ్మాపూర్: మండలంలోని రామకృష్ణకాలనీ శివారు మసీదు వద్ద రాజీవ్ రహదారిపై గురువారం ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఓ కారు అతివేగంగా వచ్చి, ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ బోల్తా పడింది. డ్రైవర్ అప్రమత్తమై దూకడంతో ప్రాణాపాయం తప్పింది. ఎల్‌ఎండీ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, ట్రాక్టర్‌ను, కారును పక్కకు తీసి, వాహనాలను పంపించారు.

కొనసాగుతున్న పంచాయతీ కార్యదర్శుల సమ్మె



హుజూరాబాద్‌రూరల్: డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మె గురువారంతో ఏడో రోజుకు చేరింది. గ్రామాలాభివృద్ధికి అహర్నిశలు పాటుపడుతున్న కార్యదర్శులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. సమ్మెకు సర్పంచులు నేరెళ్ల మహేందర్‌గౌడ్, తాటికొండ పుల్లాచారి, శంకరపట్నం సీనియర్ కార్యదర్శులు శ్రీనివాస్‌రెడ్డి, గురువయ్య, నర్సయ్యలు సంఘీభావం తెలిపారు. సమ్మెలో జూనియర్ పంచాయత్ కార్యదర్శులు మనోహర్‌రెడ్డి, కిషన్, శ్రీధర్‌రెడ్డి, సుమన్, శ్రీనివాస్, రాము, శిరీష, సంధ్య, స్వప్న, నజీమా తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భద్రతపై అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న విద్యుత్ అధికారులు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని చెల్పూర్‌లో హుజూరాబాద్‌రూరల్ సెక్షన్ పరిధి విద్యుత్ వినియోగదారులకు, ప్రజాప్రతినిధులకు గురువారం విద్యుత్ భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏఈ రవీందర్ మాట్లాడుతూ... వర్షాకాలంలో విరిగిన విద్యుత్ స్తంభాలు, తెగిపడిన విద్యుత్ తీగలను ముట్టుకోవద్దని సూచించారు. ఒకరోజు ఒక యూనిట్ విద్యుత్ ఆదా చేస్తే జీవిత కాలంలో లక్ష రూపాయలు పొదుపు చేసినట్టేనని, విద్యుత్ ప్రమాదాలు సంభవించకుండా సమస్యలు ఉంటే స్థానిక లైన్‌మన్, సెక్షన్ ఆఫీసర్‌కు ఫోన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో సత్యనారాయణ, లైన్ మన్‌లు రమేష్, వెంకటేశ్వర్లు, గణేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.